క్లుప్తంగా

నేడు వేదగిరివారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని వేదగిరివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు.

కాంగ్రెస్ తీరుపై నిరసన


నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు

చిత్తూరు కార్పొరేషన్: అంబేడ్కర్ పేరిట కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరుపై బీజేపీ నేతలు నిరసన తెలిపారు. ఆదివారం దర్గా సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, నేతలు భానుప్రకాష్, నీరజాక్షులు, కన్నయ్య, మస్తాన్, రామభద్ర పాల్గొన్నారు.

గౌడ కులస్తులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- మాజీ మంత్రి ప్రభాకర్‌గౌడ్


వన భోజన మహోత్సవంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌గౌడ్

బంగారుపాళెం: గౌడ కులస్తులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని మాజీ మంత్రి ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయం ఆవరణలో గౌడ కులస్తుల 21వ వన భోజన మహోత్సవాన్ని రాష్ట్ర కార్యదర్శి బుసా నాగరాజగౌడ్, జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి గౌడ్, ప్రధాన కార్యదర్శి గోపి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధి చెందాలంటే కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కల్లు గీత ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాత జయప్రకాష్ నారాయణగౌడ్, సుధాకర్‌గౌడ్, శంకరావుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక దేవస్థానంలోని నిత్యాన్నదానానికి ఆదివారం ఓ దాత నగదు విరాళం అందించారు. సికింద్రాబాద్‌కు చెందిన రాజ్యలక్ష్మి రూ.లక్ష నగదును డీడీ రూపంలో ఆలయ అధికారులకు అందజేశారు. వీరికి ఆలయ సిబ్బంది ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

‘పుష్ప’ అభిమానులు సైతం..!

- పార్టీలతో సంబంధం లేకుండా మాజీ సీఎం జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న అల్లు అర్జున్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు

పలమనేరు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు నియోజకవర్గంలోని అల్లు అర్జున్ అభిమానులు కూడా ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులతోపాటు సినీనటుడు అల్లు అర్జున్ అభిమానులు సైతం ఈ పర్యాయం వేడుకలు నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. శనివారం రాత్రి నియోజకవర్గంలోని 40 గ్రామాల్లో ఈ కార్యక్రమాలు సాగాయి. జగన్‌మోహన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలను తెలుపుతూ కేక్‌లు కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం


ప్రత్యేకాలంకారంలో దేవదేవేరులు

సదుం: మండలంలోని జోగివారిపల్లె వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం పద్మావతి వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం హోమాలు, కల్యాణోత్సవం భక్తజన సందడి నడుమ శాస్త్రోక్తంగా అర్చక, వేద పండితులు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వాహకులు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను మేళ తాళాలతో గ్రామంలో ఊరేగించారు.


కల్యాణోత్సవంలో భక్తులు

క్రిస్మస్ శోభ

ముచ్చటగొలుపుతున్న క్రిస్మస్ అలంకరణ వస్తువులు





చిత్తూరు రూరల్ (కాణిపాకం): డిసెంబర్ మాసం వచ్చిందంటే చాలు నగరంతో పాటు, పల్లెల్లోని చర్చిలు, వీధులు విద్యుత్ కాంతులు, స్టార్లతో కళకళలాడుతాయి. క్రైస్తవ సోదరులు తమ ఇళ్లను విద్యుత్ వెలుగులతో అలంకరించి ఇంటిపై ఆకర్షణీయమైన స్టార్‌ను ఏర్పాటు చేస్తారు. ప్రతి చర్చిని వివిధ అలంకరణలు, విద్యుత్ వెలుగులతో ముస్తాబు చేస్తున్నారు. క్రిస్మస్ పండగకు అవసరమైన ప్రతి వస్తువు చిత్తూరు నగరంలోని బజారువీధి, చర్చివీధి, సుందరయ్య వీధుల్లో లభ్యమవుతున్నాయి. వివిధ రకాల స్టార్లతో పాటు, ఎలక్ట్రికల్ వెలుగులును విరజిమ్మే స్టార్లు సైతం మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. దీంతో పాటు వివిధ మోడళ్లలో శాంతాక్లాజ్ (క్రిస్మస్ తాత) బొమ్మలు, క్రిస్మస్ ట్రీలు, క్రిస్మస్ పండగకు అలంకరించేందుకు ప్రత్యేకమైన పశువుల పాక, ఇతర బొమ్మలు సైతం లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో క్రైస్తవ సోదరులతో మార్కెట్ సందడిగా మారింది. వారికి కావాల్సిన మోడళ్లను ఎంపిక చేసుకుని మరీ కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే చిత్తూరు నగరం, ఆయా గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఊపందుకున్నాయి.

కళకళలాడుతున్న మార్కెట్‌లు

క్రిస్మస్ పండగ సందర్భంగా వివిధ రకాల మోడళ్లతో మార్కెట్ కళకళలాడుతోంది. స్టార్లు కాగితం, ప్లాస్టిక్‌తో పాటు, ఎలక్ట్రికల్ స్టార్లు.. రూ.10 నుంచి రూ.600 వరకు కాగితాలివి, ప్లాస్టిక్‌తో లభిస్తుండగా, ఎలక్ట్రికల్ స్టార్లు రూ.వంద నుంచి రూ. వెయ్యి వరకు లభిస్తున్నాయి. క్రిస్మస్ ట్రీలు రూ.20 నుంచి రూ.8 వేల వరకు ఉండగా, శాంతాక్లాజ్లు రూ.30 నుంచి రూ.5 వేల వరకు ధరలు పలుకుతున్నాయి. దీంతో వివిధ అలంకరణ సామగ్రి సైతం అందుబాటు ధరలో ఉన్నాయి. డింగ్‌డాంగ్ బెల్స్, విద్యుత్ ల్యాంప్స్ ఇలా అనేక రకాలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. దీంతో క్రైస్తవ సోదరులు మార్కెట్లో కొనుగోలు చేసి, వారి ఇళ్లను, చర్చిలను సుందరంగా అలంకరిస్తున్నారు. నగరంలోని ప్రతి చర్చి, క్రైస్తవ సోదరుల ఇళ్లు క్రిస్మస్ స్టార్లు, విద్యుత్ వెలుగులతో కొత్త శోభను సంతరించుకుంటున్నాయి.

ఘనంగా జగనన్న జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలంలోని పాలంతోపు గ్రామంలో శనివారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తొలుత జలకంఠేశ్వర స్వామి ఆలయంలో మాజీ సీఎం పేరుతో అభిషేకం, అర్చన చేయించారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి చేతుల మీదుగా కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో మండల నాయకులు జయపాల్, జెడ్పీటీసీ ఎం.ఎస్‌బాబునాయుడు, నాయకులు సంపత్, త్యాగరాజులు, అమర్‌నాథ్‌రెడ్డి, జయరామ్‌నాయుడు, ఎంపీటీసీ, సర్పంచులు, నాయకులు ప్రతిమారెడ్డి, దిలీప్, సుబ్రమణి, సుదర్శన్, రాబర్ట్, ముత్తుకూరు భాస్కర్, భాస్కర్‌రెడ్డి, వేలుస్వామి, రామ్మోహన్ పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్‌లో ‘గ్రీవెన్స్’

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా జరపాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జనవరి 11న వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా జరపాలని రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళీ కోరారు. చిత్తూరు నగరంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వడ్డెర్ల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. తమ సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లేలా ఈనెల 29న చిత్తూరులో భారీ సభను నిర్వహిస్తున్నామన్నారు. కులవృత్తుల వారికి పనిముట్లు, యంత్రాలకు నిధులు మంజూరు చేస్తే తమకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సమావేశంలో వడ్డెర సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు, నాయకులు హరిబాబు, రుద్రయ్య, కుసుమ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వడ్డెర్ల సంఘ నాయకులు

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

గుడిపాల: మండలంలోని కిల్లారిపల్లె ప్రాథమిక పాఠశాల వద్ద ఆదివారం పేకాట ఆడుతున్న గ్రామస్తులు కుప్పుస్వామి(34), శివ(36), గణేష్(65), సుదర్శన్(36)ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.1,150 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. ఎవరైనా జూదం నిర్వహిస్తుంటే 9440796172 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

పంటలపై ఏనుగుల దాడి


ఏనుగులు విరిచేసిన కొబ్బరి చెట్టు, దెబ్బతిన్న వరి నారు

పెద్దపంజాణి: మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొంత కాలంగా పెద్దకాప్పల్లె పంచాయతీలోని అటవీ సరిహద్దు గ్రామాల రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. శనివారం రాత్రి పుంగనూరు ఫారెస్ట్ రేంజ్ పేటూరు బీట్ నుంచి వచ్చిన ఏనుగులు పెద్దకాప్పల్లె గ్రామ సమీపంలోని పంటలపై విరుచుకుపడ్డాయి. జయారెడ్డి, కొండారెడ్డి తదితరుల కొబ్బరి, బొప్పాయి, అరటి చెట్లను ధ్వంసం చేశాయి. వరి నారును తొక్కి తీవ్ర నష్టం కలిగించాయి. ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటనష్టాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ఏనుగుల వల్ల భారీగా నష్టపోతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను అటవీ ప్రాంతం నుంచి పొలాల్లోకి రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరారు.

భక్తులతో కిటకిటలాడిన అర్ధగిరి క్షేత్రం


ఆలయంలో ఓంశక్తి భక్తుల సందడి

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం ఆదివారం అయ్యప్ప స్వామి, ఓం శక్తి భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఆలయంలో స్వామికి శాస్త్రోక్తంగా అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. పలు రాష్ట్రాల నుంచి అయ్యప్ప స్వామి, ఓం శక్తి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో సందడి నెలకొంది.

ఆయాల గోడు ప్రభుత్వానికి పట్టదా?

బంగారుపాళెం: ఆయాల గోడు ప్రభుత్వానికి పట్టదా అని ప్రభుత్వ పాఠశాల ఆయాల వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయకుమారి ఆరోపించారు. మండల కేంద్రం బంగారుపాళెం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆదివారం ప్రభుత్వ పాఠశాల ఆయాల వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ అనుబంధ సంఘం సమావేశాన్ని మండల నాయకురాలు ప్రతిభ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరు నెలలుగా ఆయాలకు జీతాలు మంజూరు చేయకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆయాలకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజ, చిత్తూరు నియోజకవర్గ కార్యదర్శి దాసరి చంద్ర మాట్లాడుతూ.. ప్రభుత్వ జీఓ ప్రకారం ఆయాలకు రూ.11,500 చెల్లించాలన్నారు.విధుల నుంచి తొలగించిన కార్మికులను తిరిగి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వనిత, రఘు, భారతి, గీత, ప్రతిభ, కళ్యాణి, వేదవతి, లక్ష్మి, శిద్దమ్మ, శశికళ, నిర్మల, రీనా, చిట్టెమ్మ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జయకుమారి

పోటెత్తిన భక్తజనం


భక్తుల రద్దీతో క్యూలైన్‌లు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి క్షేత్రం ఆదివారం జనసందడిగా కనిపించింది. ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వీరి రాకతో ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయం భక్తులతో కిటకిటలాడింది. క్యూలైన్లు రద్దీగా కనిపించాయి. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర, వీఐపీ దర్శన లైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. దీంతో ఆలయ అధికారులు భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేలా చర్యలు తీసుకున్నారు.

మదిని దోచే ‘మాధవరం’

- సందర్శకులతో సందడే సందడి


మాధవరం జలపాతం

తవణంపల్లె: తుఫాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు అటవీ ప్రాంతాల్లోని జలపాతాలు జాలువారుతూ సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. మండలంలోని మాధవరం సమీపంలో అటవీ ప్రాంతంలోని జలపాతంలో నీరు అధికంగా ప్రవహిస్తోంది. అటవీ ప్రాంతంలోని జలపాతం ఉన్న ప్రదేశంలో ఆహ్లాదకరమైన వాతావరణం, వృక్షాలు ఉండడంతో సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా సెలవు రోజుల్లో చిత్తూరు, బంగారుపాళ్యం, తవణంపల్లె, ఐరాల, రాయలపేట, పెద్దఉప్పరపల్లె తదతర ప్రాంతాల నుంచి పిల్లలు, పెద్దలు, యువత అధికంగా వస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జలపాతంలో స్నానాలు చేయడం, ప్రవహిస్తున్న నీటిలో ఈత కొట్టి పిల్లలు, యువకులు సంతోషంగా గడుపుతున్నారు. ఆహ్లాదకరమైన ప్రదేశంలో పర్యటకుల సందడి రోజు రోజుకు పెరుగుతోంది. చదువులు, ఉద్యోగ బాధ్యతల ఒత్తిడితో గడుపుతున్న యువత జలపాతాన్ని సందర్శించి ఉపశమనం పొందుతున్నారు. వేసవి కాలంలోనూ జలపాతంలో నీటిమట్టం తగ్గకుండా నీరు ప్రవహిస్తుండడంతో సందర్శకుల సందడి నెలకొంటోంది. పర్యాటక శాఖ అధికారులు మాధవరం జలపాతాన్ని సందర్శించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు, సందర్శకులు కోరుతున్నారు.


సందర్శకుల సందడి


జలపాతం వద్ద మడుగులో సరదాగా ఆడుకుంటున్న పిల్లలు


ర్యాలీలో క్రైస్తవ సోదరులు

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లెలో ఆదివారం రాత్రి క్రైస్తవ సోదరులు ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. స్థానిక కార్న్‌స్టోన్ చర్చిలో పాస్టర్లు శామ్యూల్, మేరీజాన్, దివ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం తగ్గువారిపల్లె, ముంగరమడుగు, తిమ్మోజుపల్లె, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో క్రీస్తు పాటలు ఆలపిస్తూ ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు క్రిస్మస్ తాత వేషధారణతో అలరించారు.

జేఏసీ నాయకులపై అక్రమ కేసులు సరికాదు

కాణిపాకం: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లోని కేశ ఖండనశాలలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులను పర్మినెంట్ చేస్తామని జేఏసీ నాయకులు లక్షల రూపాయలు వసూలు చేశారన్న ఆరోపణలపై నిజానిజాలు పరిశీలించకుండానే కేసులు పెట్టడాన్ని కాణిపాకం దేవస్థానం కల్యాణకట్ట ఉద్యోగుల సంఘం సభ్యులు దామోదరం, ప్రభాకర్, మురళి శనివారం ఖండించారు. కూటమి ప్రభుత్వం కనీస వేతనం రూ.25 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఈ హామీని నెరవేర్చే క్రమంలో కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తూ వివాదాలు సృష్టిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న కళా తరంగిణి ప్రదర్శనలు


కళాకారుల ప్రదర్శన

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె చెక్‌పోస్టు సమీపంలోని రాయల్ మహల్ కల్యాణ మండపంలో ఆదివారం కళా తరంగిణి సంస్థ నిర్వహించిన సాంస్కృతిక, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. జిల్లాలో నుంచే కాక కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వందలాది మంది కళాకారులు నృత్యపోటీల్లో తమ విద్వత్తును చాటారు. విజేతలకు కళాతరంగిణి వ్యవస్థాపక కార్యదర్శి రాజేష్ బాబు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు మస్తాన్, నారాయణ, సంధ్య, కళా తరంగిణి సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.